సాక్షి అనంతపురం

గురువారం । 25 । మే । 2023



చీనీ టన్ను రూ.36,500

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36,500 ప్రకారం పలికాయి.



నేడు డయల్ యువర్ ఎస్ఈ

విద్యుత్ సమస్యలపై గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఈ (08554 272943) కార్యక్రమం నిర్వహించనున్నారు.

గరిష్టం/కనిష్టం
41.8°/24.5°

జిల్లా అంతటా బుధవారం వగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



రాప్తాడురూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఉదయం ఉమ్మడి జిల్లాలోని 77 కేంద్రాల్లో జరిగిన మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 3,062 మంది విద్యార్థులు హాజరయ్యారు. 164 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,311 మంది విద్యార్థులకు గాను 1,232 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు.

29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ఈ నెల 29న మొదలవుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) బి.చంద్రానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంలో ఆర్‌బీకే వేదికగా రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి 30,600 మంది రైతులు 27 వేల క్వింటాళ్ల విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. గురువారం నుంచి కందులు, పెసలు, కొర్రలు, రాగులకు కూడా రిజిస్ట్రేషన్లు మొదలవుతాయన్నారు. కాగా.. బుధవారం నాటికి 186 ఆర్‌బీకేల పరిధిలో 15 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి తెలిపారు. పంపిణీ మొదలయ్యే నాటికి ఎక్కడా కొరత, ఇబ్బంది లేకుండా ప్రతి ఆర్‌బీకేలోనూ అవసరమైన మేర విత్తనకాయలు నిల్వ చేస్తామని తెలిపారు.

భారత అండర్-23 మహిళా క్రికెట్ జట్టుకు అనూష ఎంపిక



అనంతపురం: భారత అండర్-23 మహిళా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన బి.అనూష ఎంపికై ంది. ఈమె స్వగ్రామం నార్పల మండలం బండ్లపల్లి. రైతు కుటుంబం నుంచి వచ్చి క్రికెట్‌లో అంచెలంచెలుగా ఎదుగుతోంది. ఎడమ చేతి వాటం బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణిస్తోంది. హాంకాంగ్‌లో జరిగే అండర్-23 అంతర్జాతీయ మహిళా క్రికెట్ టోర్నీలో టీమిండియా తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన అనూష జాతీయ జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది.

వాహనదారులకు మెరుగైన సేవలు



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బసిరెడ్డి

అనంతపురం సెంట్రల్: వాహనదారులకు మెరుగైన సేవలందించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (రీజనల్) బసిరెడ్డి రవాణా శాఖ అధికారులకు సూచించారు. బుధవారం అనంతపురం వచ్చిన ఆయన ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్‌తో కలిసి రవాణా శాఖ లక్ష్యాలు, అధికారుల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ తప్పించుకొని తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. రవాణాశాఖ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు క్విక్ అండ్‌గుడ్ సర్వీస్ అందించాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, అతికనాజ్, సునీత, శ్రీనివాసులు, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారతకు సహకారం

- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల అడుగులు
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా సర్కారు ప్రోత్సాహం
- సెక్యూరిటీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల దాకా వ్యక్తిగత రుణాలు
- పీఎంఈజీపీ, వైఎస్సార్ చేయూత, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తోడ్పాటు



నార్పల మండలం బొందలవాడలో ఎండ్లూరి రాధిక నిర్వహిస్తున్న ఆర్గానిక్ బెల్లం తయారీ యూనిట్

అనంతపురం: స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మల ఆర్థికసాధికారతకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. ఇందుకోసం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి అనేక పథకాలు పకడ్బందీగా అమలు చేస్తోంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకున్న మహిళల ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు 100 శాతం తిరిగి చెల్లిస్తుండటంతో స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తే తిరిగి చెల్లించగలరు అనే నమ్మకం బ్యాంకర్లలో ఏర్పడింది. దీంతో స్వయం సహాయక సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. సంఘాల్లోని మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపారాభివృద్ధికి బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలను ఎటువంటి సెక్యూరిటీ (పూచీకత్తు) లేకుండా వచ్చేలా కృషి చేస్తున్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ), ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన (పీఎంఎంఎస్‌వై), మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ లిమిటెడ్ (ముద్ర), ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), స్టార్టప్ ఇండియా పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న బడుగు వికాసం, ఫిష్ ఆంధ్రా, ఫిట్ ఆంధ్రా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా వ్యాపారాభివృద్ధికి సహకారం అందిస్తారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల గుర్తింపు ఇలా..

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగడానికి వీలుగా డీఆర్‌డీఏ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించడం, వారి వ్యాపారాభివృద్ధికి అవగాహన కల్పించడం, బ్యాంకు నుంచి ముందస్తు రుణం తీసుకోవడం వంటి కార్యక్రమాలను పర్యవేక్షణ చేస్తారు.

ఏడాదికి రూ.5లక్షల ఆదాయం



నా పేరు మహబూబ్ జాన్. భర్త పేరు నిసార్. మాది రాప్తాడు మండలం చిన్నయనగర్. మాకు ఇద్దరు సంతానం. పెద్దకుమారుడు సీఏ, చిన్న కుమారుడు బీటెక్ చదువుతున్నారు. సొంతంగా వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో రోటీ తయారీ మిషన్ కొనుగోలు చేశాను. పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ ద్వారా రుణం తీసుకునేలా డీఆర్‌డీఏ అధికారులు సహకారం అందించారు. మొత్తం 9,08,000లు కాగా, బ్యాంకు రుణం మొత్తం రూ.8,18,000, అందులో మా వాటా రూ.90,000 ఉంది. అనంతపురం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ ప్రాంతాలకు రోటీలు సరఫరా చేస్తున్నాం. నెలకు రూ.45,000 ఆదాయం వస్తోంది. ఏడాదికి సగటున రూ.5 లక్షల ఆదాయం లభిస్తోంది.

ప్రభుత్వ సహకారం మరువలేనిది



నా పేరు ఎండ్లూరి రాధిక. భర్త పేరు శ్రీనివాసులు. మాది నార్పల మండలం బొందలవాడ పంచాయతీ. మాకు ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి, ఐదో తరగతి, చిన్నమ్మాయి రెండో తరగతి చదువుతోంది. మాది వ్యవసాయాధారిత కుటుంబం. మా పూర్వీకులు సంప్రదాయమైన పద్ధతిలో బెల్లం తయారు చేసేవారు. మేము కూడా బెల్లం తయారీనే ఉపాధి మార్గంగా ఎంచుకున్నాము. పీఎం ఫార్మలైజేషన ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కింద అవగాహన తెచ్చుకుని రుణం కోసం దరఖాస్తు చేశాం. ఇందులో మా వాటా రూ.82 వేలు, బ్యాంకు రుణం రూ.7,38,000. మొత్తం రూ.8,20,000తో ఆర్గానిక్ బెల్లం తయారీ యూనిట్ నెలకొల్పాను. దీని ద్వారా నెలకు రూ.50 వేల దాకా ఆదాయం వస్తోంది. ప్రభుత్వం అందించిన సహకారం మరువలేం.

ఆదాయం బాగుంది



పీఎంఎఫ్‌ఎంఈ సీడ్ క్యాపిటల్ ద్వారా రూ.1,20,000తో బేకరీ ఉత్పత్తుల యూనిట్ ప్రారంభించాను. ఇందులో రూ.40 వేలు సీడ్ క్యాపిటల్ ద్వారా పొందాను. నెలకు రూ.10 వేలు చొప్పున ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణకు ఉపయోగపడుతోంది. ఇంటిల్లిపాది హాయిగా ఉంటున్నాం.

– వై.లక్ష్మీదేవి, గుత్తి

సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యుల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి తగిన తోడ్పాటునిచ్చే రీతిలో అన్ని దశల్లోనూ సహకారం అందిస్తున్నాం. రుణానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి రుణం పొందేంత వరకు ఫాలోఅప్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఒక్కో సభ్యురాలికి రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణం దక్కే రీతిలో సహకారం అందిస్తాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

29 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతపురం: పాలిసెట్-2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 29 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అనంతపురం) ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జూన్ ఐదో తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి జూన్ ఒకటో తేదీలోపు ఏపీ పాలిసెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. కౌన్సెలింగుకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ ఇలా..

తేదీ	ర్యాంకు నుంచి	వరకు
మే 29	01	12,000
మే 30	12,001	28,000
మే 31	28,001	43,000
జూన్ 01	43,001	58,000
జూన్ 02	58,001	74,000
జూన్ 03	74,001	91,000
జూన్ 04	91,001	1,08,000
జూన్ 05	1,08,001	ఆపైన

పోక్సో కేసులో టీచరుకు మూడేళ్ల జైలు

అనంతపురం: విద్యార్థినిని లైంగికంగా వేధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, రూ.పది వేల జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. గుత్తి పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని అదే పాఠశాల ఇంగ్లిష్ టీచర్ సాలవేముల బాబు లైంగికంగా వేధించాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుత్తి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి 17, 2022లో కేసు నమోదైంది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అభియోగాలు రుజువు కావడంతో సాలవేముల బాబుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి బుధవారం తీర్పు వెలువరించారు.

విద్య వెలకట్టలేని ఆస్తి

- విద్యార్థుల ఉజ్వల భవితకు సీఎం కృషి
- విద్యాదీవెన పథకం పేద విద్యార్థులకు వరం
- జిల్లాలో 31,576 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.29.25 కోట్లు జమ



జగనన్న విద్యా దీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: 'భావితరాలకు వెలకట్టలేని ఆస్తి ఏదైనా మనం ఇచ్చామంటే అది ఒక్క విద్య మాత్రమే అనే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా విశ్వసిస్తారు. అందుకే ఆయన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క పేద విద్యార్థీ ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను అమలు చేస్తూ వారికి ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్నారు' అని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ అన్నారు. సీఎం జగన్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి విద్యాదీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని విద్యార్థులతో కలిసి విద్యాదీవెన మెగాచెక్కును విడుదల చేసి మాట్లాడారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 35,056 మంది విద్యార్థులకు చెందిన 31,576 మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.29,25,72,102 మొత్తాన్ని జమ చేశారన్నారు. పేదలకు ఉన్నత విద్యను అందించాలనే ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు బాగా చదవి ఉన్నతస్థాయి ఎదగాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుశల్ జైన్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అదనపు ఎస్పీ హనుమంతు, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, వక్ఫ్‌బోర్డ్ చైర్‌పర్సన్ కాగజ్‌గర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైఫుల్లా, సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి అన్నాదొర, బీసీ సంక్షేమాధికారి ఖుష్బూకొఠారి, ఇతర అధికారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఊతం



"పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా సీఎం జగన్ ఊతమిస్తున్నారు. నాకు విద్యాదీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.10వేలు, వసతి దీవెన కింద రూ.10 వేలు వచ్చింది. సీఎం అందిస్తున్న సహకారంతో బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదుగుతాము.

– సుచిత్ర, బీకామ్ ఫైనలియర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల

అన్నలా అండగా ఉంటున్నారు



పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఒక అన్నలా అండగా ఉంటున్నారు. జగనన్న విద్యాదీవెన కింద నాకు రూ.13 వేలు, వసతిదీవెన కింద రూ.10వేలు వచ్చింది. సీఎం ఆశయానికి అనుగుణంగా చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటాము."

– ఇంద్రజ, బీకామ్ ఫైనల్ ఇయర్, మాస్టర్ మైండ్ కళాశాల

ఆవు పొట్టలో 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు!

- శస్త్రచికిత్స చేసి వెలికి తీసిన 1962 అంబులెన్స్ హెల్ప్‌లైన్ సిబ్బంది



శస్త్రచికిత్స చేస్తున్న ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్లు సునీత, మౌనిక తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: 1962 వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ డాక్టర్లు ఓ ఆవుకు ఆపరేషన్ చేసి పొట్టలోని 15 కిలోల ప్లాస్టిక్- ఇనుప మిశ్రమాల వ్యర్థాలను తొలగించి కాపాడారు. వివరాలు.. జేఎన్‌టీయూ(ఏ) ఉద్యోగి పవన్‌కుమార్ కొన్ని రోజులుగా తన ఆవు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి, మంగళవారం 1962 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. దీంతో వైఎస్సార్ సంచార వైద్యశాల వాహనంలో డాక్టర్లు అక్కడకు చేరుకుని ఆవును పరిశీలించి, వెంటనే స్థానిక పశువుల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన పశుసంవర్ధకశాఖ శింగనమల ఆస్పత్రి ఏడీ డాక్టర్ జి.పద్మనాభం .. ఆవు పొట్టలో వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కందకూరు పశువైద్యురాలు డాక్టర్ శ్వేత, 1962 అంబులెన్స్ డాక్టర్లు సునీత, మౌనిక తదితరుల సహకారంతో రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి ఆవు పొట్టలో నుంచి 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు, చిన్నపాటి ఇనుపముక్కలు, టీస్పూన్, వాటర్ బాటిల్ మూతలు వెలికి తీశారు. ఆపరేషన్ తర్వాత ఆవును 1962 వాహనంలో సురక్షితంగా యజమాని ఇంటి వద్ద దించివచ్చారు.

ఖరీఫ్ అంచనాల్లో కళ్యాణదుర్గం టాప్ !

- అన్ని రకాల పంటలు 23,560 హెక్టార్లు అంచనా
- రాయదుర్గంలో వేరుశనగ, వజ్రకరూరులో కంది
- పెద్దవడుగూరులో పత్తి, కణేకల్లులో వరి అధికం



మొక్కజొన్న కంది



వేరుశనగ పత్తి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్-2023లో సాగయ్యే అన్ని రకాల పంటల అంచనాల్లో కళ్యాణదుర్గం మండలం అగ్రస్థానంలో ఉంది. మండల వ్యాప్తంగా ఈ సారి 23,560 హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. అందులో నీటి వసతి కింద 4,293 హెక్టార్లు, వర్షాధారంగా 19,267 హెక్టార్లలో వస్తాయని అంచనా వేశారు. ఓవరాల్‌గా 31 మండలాల పరిధిలో ఈ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 4,40,877 హెక్టార్లు కాగా.. అందులో నీటి వసతి కింద 1,01,158 హెక్టార్లు, వర్షాధారంగా 3,39,719 హెక్టార్లు. ఈ క్రమంలో అన్ని రకాల పంటల సాగులో కళ్యాణదుర్గం మొదటి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత 20,902 హెక్టార్లతో వజ్రకరూరు, 19,563 హెక్టార్లతో గుంతకల్లు, 19,563 హెక్టార్లతో పెద్దవడుగూరు, 18,651 హెక్టార్లతో కూడేరు మండలాలు నిలిచాయి.

రాయదుర్గంలో వేరుశనగ, పెద్దవడుగూరులో పత్తి

వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2,31,150 హెక్టార్లుగా అంచనా వేశారు. అందులో అత్యధికంగా రాయదుర్గం మండలంలో 14,596 హెక్టార్లు, ఆ తర్వాత గుంతకల్లులో 14,178 హెక్టార్లు, కళ్యాణదుర్గంలో 13,898 హెక్టార్లు, వజ్రకరూరులో 13,209 హెక్టార్లు, బ్రహ్మసముద్రంలో 12,542 హెక్టార్లుగా అంచనా వేశారు. మరో 8 మండలాల్లో 10 వేల హెక్టార్లకు పైబడి విస్తీర్ణంలో వేరుశనగ సాగులోకి రానుంది.

- మరో ప్రధానపంట పత్తికి మొదటి నుంచి పెద్దవడుగూరు కేరాఫ్‌గా నిలుస్తోంది. మండల వ్యాప్తంగా దాదాపు 80 శాతం విస్తీర్ణం అంటే 16,603 హెక్టార్లలో పత్తి వేస్తారు. ఆ తర్వాత యాడికి 5,233 హెక్టార్లు, పామిడి 5,209 హెక్టార్లు, విడపనకల్లు 4,293 హెక్టార్లు, తాడిపత్రి 3,556 హెక్టార్లతో టాప్-5లో ఉన్నాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 51,612 హెక్టార్లు కాగా.. అందులో సగం విస్తీర్ణం ఈ ఐదు మండలాల్లోనే సాగులోకి రావడం విశేషం.

వజ్రకరూరులో కంది, కళ్యాణదుర్గంలో ఆముదం

జిల్లాలో కంది సాధారణ విస్తీర్ణం 30,225 హెక్టార్లుగా గుర్తించారు. అందులో అత్యధికంగా వజ్రకరూరులో 3,875 హెక్టార్లు, గుంతకల్లు 2,788 హెక్టార్లు, కళ్యాణదుర్గం 2,201 హెక్టార్లు, అనంతపురం 1,933 హెక్టార్లు, రాప్తాడు 1,833 హెక్టార్ల విస్తీర్ణంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఇక ఆముదం పంట సాధారణ సాగు 12,409 హెక్టార్లుగా అంచనా వేశారు. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 2,545 హెక్టార్లు, బెళుగుప్ప 2,041 హెక్టార్లు, కూడేరు 1,356 హెక్టార్లు, వజ్రకరూరు 940 హెక్టార్లు, ఆత్మకూరు 678 హెక్టార్ల అంచనాతో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

కణేకల్లులో వరి, పెద్దపప్పూరులో మొక్కజొన్న

నీటి వసతి కింద వరి సాధారణ విస్తీర్ణం 17,440 హెక్టార్లుగా అంచనా వేశారు. అందులో కణేకల్లు మండలంలో అత్యధికంగా 5,220 హెక్టార్లు, బొమ్మనహాళ్ 2,797 హెక్టార్లు, గార్లదిన్నె 1,326 హెక్టార్లు, పామిడి 968 హెక్టార్లు, శింగనమల 859 హెక్టార్లతో సగానికి పైగా విస్తీర్ణం ఈ మండలాల్లోనే సాగులోకి రానుందని అంచనా వేశారు. ఇక మొక్కజొన్న సాధారణ సాగు 8,341 హెక్టార్లు కాగా అందులో అత్యధికంగా పెద్దపప్పూరు 1,698 హెక్టార్లు, పుట్లూరు 1,017 హెక్టార్లు, యాడికి 946 హెక్టార్లు, యల్లనూరు 714 హెక్టార్లు, కణేకల్లు 601 హెక్టార్లతో సగానికి పైగా విస్తీర్ణం ఈ ఐదు మండలాల్లోనే రానుంది.

క్లుప్తంగా

రొద్దం పోస్టుమాస్టర్‌పై వేటు



సోమందేపల్లిలోని తపాలా శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని తపాలా శాఖలో అక్రమాలు రోజుకొక్కటి చొప్పున వెలుగు చూస్తున్నాయి. తాజాగా రొద్దం సబ్ పోస్ట్‌మాస్టర్ యు.జయప్రకాశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 2017–19 సంవత్సరాల్లో సోమందేపల్లి సబ్‌పోస్ట్‌మాస్టర్‌గా పని చేసిన కాలంలో ఆయన భారీగా అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆలస్యంగా గుర్తించిన ఆ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయగా రూ.18 లక్షలు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో ఇటీవల రూ.4 లక్షలు రికవరీ చేశారు. మిగిలిన రూ.14 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. ఈ క్రమంలో అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

మార్కెటింగ్‌శాఖకు ప్రతిభా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏడీఎం సత్యనారాయణచౌదరి


అనంతపురం అగ్రికల్చర్: గత మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్ల లక్ష్యాన్ని వందశాతం సాధించిన జిల్లా మార్కెటింగ్ శాఖకు ప్రతిభా అవార్డు దక్కింది. గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ శాఖ కమిషనర్ రాహుల్‌పాండే నుంచి మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి అవార్డు, ప్రశంసాప్రతాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని ఏడీఎం చౌదరి తెలిపారు. రాయలసీమ రీజియన్ పరిధిలో ఉన్న 8 జిల్లాలకు గానూ తిరుపతి, అనంతపురం జిల్లాలు మాత్రమే 100 శాతాన్ని లక్ష్యాన్ని సాధించాయన్నారు. గతేడాది జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీల ద్వారా రూ.10.43 కోట్లకు గానూ 103 శాతంతో రూ.10.71 కోట్లు సాధించినట్లు వివరించారు. అవార్డు దక్కడం ఆనందంగా ఉందని, ఈ ఏడాది మరింత బాధ్యతతో పనిచేసి నిర్దేశించిన రూ.10.81 కోట్ల వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

‘అనంత’ త్యాగధనుడు కల్లూరు

సందర్భం | నేడు కల్లూరు సుబ్బారావు జయంతి



అనంతపురం కల్చరల్: కొందరు వ్యక్తులు గొప్ప వాళ్లుగా జన్మిస్తారు. మరికొందరికి లోకం గొప్పతనం ఆపాదిస్తుంది. చాలా కొద్ది మంది మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో గొప్పవారవుతారు. ఈ కోవకు చెందిన వారే కల్లూరు సుబ్బారావు. అనంత త్యాగధనుడిగా ఖ్యాతిగాంచిన ఆయన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, కళాకారులను ‘కల్లూరు సుబ్బారావు స్మారక అవార్డు’తో సత్కరించనున్నారు.



కల్లూరు సుబ్బారావు

రాయలసీమ పితామహుడిగా...

హిందూపురం సమీపంలోని కల్లూరు గ్రామంలో 1897, మే 25న జన్మించిన కల్లూరు సుబ్బారావు 1913లో దివ్యజ్ఞాన సమాజం వ్యవస్థాపకులు అనిబీసెంట్ ప్రసంగాలతో ప్రభావితమై జాతీయోద్యమంలో చేరారు. లక్షాధికారుల ఇంట పుట్టినా పేద వారంటే ఎనలేని ప్రేమ. తన దగ్గరున్నదంతా పేదలకు ఇచ్చేశారు. స్వాతంత్రోద్యమంలో జిల్లాలో శిక్ష పొందిన మొట్టమొదటి రాజకీయ ఖైదీ ఆయనే. 1921, సెప్టెంబర్ 28న శిక్షా కాలం పూర్తికాగానే బళ్లారి సభలో గాంధీజీతో కలసి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1928, నవంబర్‌లో నంద్యాలలో జరిగిన సభలో దత్తమండలాలకు రాయలసీమగా నామకరణం చేసిన వారిలో కల్లూరు సుబ్బారావు ప్రముఖులు. 1937లో రాయలసీమ ప్రాంతాలు నష్టపోకుండా ‘శ్రీబాగ్ ఒడంబడిక’పై సంతకం చేశారు. అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్‌కు నచ్చ చెప్పి పెన్నార్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతపురంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపన, టవర్‌క్లాక్ నిర్మాణంలో ఆయన కృషి మరువలేనిది. లలితకళల పట్ల అభిమానంతో అనంతపురం నడిబొడ్డున ఉన్న విలువైన తన సొంత స్థలాన్ని ‘లలిత కళా పరిషత్’కు దానమిచ్చారు. ఆయన నిరుపమాన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1967లో ‘పద్మశ్రీ’ అవార్డుతో సత్కరించింది. జిల్లాలో అభ్యుదయ కార్యక్రమాలకు నాంది పలికిన కల్లూరు సుబ్బారావు 1973, డిసెంబర్ 20న శాశ్వతంగా కన్నుమూశారు. కానీ, ఆయన నాటిన ఆదర్శ బీజాలు అజరామరంగా నిలిచిపోయాయి.

నేడు ఎల్కేపీలో పురస్కార ప్రదాన సభ

కల్లూరు సుబ్బారావు పేరిట ఈ ఏడాది గతంలో కన్న భిన్నంగా వివిధ ప్రాంతాలకు చెందిన వారికి గురువారం సాయంత్రం స్మారక అవార్డులను అందజేయనున్నారు. ఇందుకు ఎల్కేపీ వేదిక కానుంది. అవార్డులు అందుకునే వారిలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన సీనియర్ రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన సీనియర్ సాహితీవేత్త కల్లూరు రాఘవేంద్రరావు, అనంతకు చెందిన చిత్రకారుడు, కవి ఆర్వీ ప్రసాద్ ఉన్నారు.

‘సూపర్’లో అరుదైన శస్త్రచికిత్సలు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో ఇద్దరి ప్రాణాలు కాపాడారు. ఇప్పటి వరకూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. లక్షల వ్యయంతో చేసే శస్త్రచికిత్సలను పూర్తి ఉచితంగా చేయడం గమనార్హం. శస్త్రచికిత్స, ఇతర అంశాలను బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, న్యూరో సర్జన్‌లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువ చేసే శస్త్రచికిత్స ఉచితం.

శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం సోమయాజులపల్లికి చెందిన వై.కృష్ణ ఈ నెల 9న నూనె మిల్లులో పనికి వెళ్లిన సమయంలో మూర్ఛ వచ్చి పడిపోయారు. కుటుంబీకులు కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అదే రోజు అక్కడి వైద్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. మూడ్రోజుల పాటు స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలు చేసి, మెదడులో కణతి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కేసు ఈ నెల 14న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ అయింది. డాక్టర్ భాస్కర్ వైద్య బృందం ఈ నెల 18న 4 గంటల పాటు శ్రమించి మినిమలీ ఇన్‌వెన్సివ్ మైక్రో ఆపరేషన్ చేసి 5 సెంటీమీటర్ల కణతిని తొలగించారు. ప్రస్తుతం కృష్ణ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే శస్త్రచికిత్స ప్రైవేట్‌గా చేయించాలంటే రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల ఖర్చు అవుతుంది.

పక్షవాతం రాకుండా శస్త్రచికిత్స

అనంతపురంలోని హమాలీ కాలనీకి చెందిన ఖాసీం వలి మూడేళ్లుగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 1న న్యూరో వైద్యులు పరీక్షించి అదే నెల 12న వెన్నెముక వద్ద చిన్న గాటు చేసి మైక్రోస్కోపిక్, ఎండోస్కోపిక్(మిస్) ద్వారా మినిమలి ఇన్‌వెన్సివ్ మైక్రో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ తరహా సర్జరీ ప్రైవేట్‌గా చేయించాలంటే రూ.2.5 లక్షలు ఖర్చవుతుంది. తక్కువ సమయం, తక్కువ రక్తస్రావంతో చిన్నగాటుతో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగి త్వరగా కోలుకునే అవకాశముంటుందని డాక్టర్ భాస్కర్ తెలిపారు.



శస్త్రచికిత్స చేయించుకున్న వారితో న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, తదితరులు

ఇంత పెద్ద ఆస్పత్రిని మునుపెన్నడూ చూడలేదు

నా భర్త కృష్ణకు ఫిట్స్ వచ్చినప్పుడు సర్వజనాస్పత్రిలో చేర్పించాం. మొదట్లో అక్కడి వైద్యులు కర్నూలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపారు. ఇంత పెద్ద ఆస్పత్రిని మునుపెన్నడూ చూడలేదు. చాలా పెద్దగా ఉంది. ఆస్పత్రి డాక్టర్లు నిజంగా దేవుళ్లే. రూ.లక్షలు విలువ చేసే వైద్యాన్ని ఉచితంగా చేసి నా భర్త ప్రాణాలు కాపాడారు. మాలాంటి పేదలకు ఇంత పెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రామలక్ష్మి, కృష్ణ భార్య, సోమయాజులపల్లి, గాండ్లపెంట మండలం

ఉద్రిక్తతకు దారి తీసిన రస్తా సమస్య

- ఇంటిని కూల్చేస్తారనే అపోహతో మహిళ ఆత్మహత్యాయత్నం
- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు



మహిళకు సర్దిచెబుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రాప్తాడు: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రస్తా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చేపట్టిన చర్య ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలు.. రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన రైతులు శివశంకరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణరెడ్డి, శంకరరెడ్డి, లక్ష్మిరెడ్డికు సర్వే నంబర్ 420–2లో 6.56 ఎకరాల భూమి ఉంది. దీనికి తూర్పున ఉన్న సర్వే నంబర్ 425లో 7.03 ఎకరాల ప్రభుత్వ భూమి మీదుగా రైతులు తమ భూమిలోకి రాకపోకలు సాగించేవారు. ఈ క్రమంలో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిని నివేశన స్థలాలు మార్చి పేదలకు పంపిణీ చేశారు. ప్రజాప్రయోజనార్థం వదిలిన సర్వే నంబర్ 420, 425కు మధ్య ఉన్న ఎకరా ప్రభుత్వ భూమికి కొందరు పట్టాలు చేసుకుని పక్కా గృహాలు నిర్మించుకున్నారు. కొన్నేళ్లుగా ఈ స్థలం మీదుగానే రాకపోకలు సాగిస్తున్న తాము పొలానికి వెళ్లేందుకు దారి వదలాలంటూ రైతులు అభ్యర్థిస్తున్నా.. గృహ యజమానులు మొండికేశారు. దీంతో సమస్యను అధికారుల దృష్టికి బాధిత రైతులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే చేసి పొలానికి రస్తా వదలాలంటూ జారీ చేసిన నోటీసులను అక్కడి వారు ధిక్కరించారు. దీంతో బుధవారం తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని రస్తాకు అడ్డుగా ఉన్న బండలు తొలగించాలని ఎర్రిస్వామి అనే వ్యక్తికి సూచించారు. వారు అంగీకరించకపోవడంతో జేసీబీ సాయంతో బండలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో పలువురు మహిళలు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారికి ఎస్‌ఐ సర్దిచెబుతుండగా... బండల పక్కనే ఇంటిని నిర్మించుకున్న వడ్డే రఘుపతి భార్య సరస్వతి తమ ఇంటిని కూల్చివేస్తారానే అపోహతో విషపూరిత ద్రావకం తాగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంటనే ఆమెను తన వాహనంలో సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో అధికారులు దిక్కుతోచక వెనుదిరిగారు. ఇంటిని తాకను కూడా తాకమని చెప్పినా వినకుండా గొడవను పెద్దది చేసేందుకు కావాలనే సరస్వతి అఘాయిత్యానికి తెర తీసినట్లు తహసీల్దార్ వివరణ ఇచ్చారు.

కర్నూలు రీజియన్‌కు నలుగురు పోస్టల్ ఎస్పీలు

అనంతపురం సిటీ: కర్నూలు తపాలా శాఖ రీజియన్‌కు నలుగురు సూపరింటెండెంట్లను కేటాయించారు. వీరంతా ఇతర రాష్ట్రాల్లో పని చేస్తుండగా, తాజాగా కర్నూలు రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారిలో మహారాష్ట్రలోని వివిధ డివిజన్లలో పని చేస్తున్న గుడిమే కిరణ్, బి.లక్ష్మన్న, హరిబాబు వందన, కె.శేషారావు ఉన్నారు. త్వరలో వీరు కర్నూలు పీఎంజీ పోస్టల్ సూపరింటెండెంట్‌లుగా ఖాళీగా ఉన్న రాయలసీమ జిల్లాల్లో నియమితులు కానున్నారు.

నాణ్యమైన వైద్యం అందించండి

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



ఇంక్యుబేటర్ పనితీరును మంత్రి ఉషశ్రీ చరణ్‌కు వివరిస్తున్న డాక్టర్ హేమలత

కళ్యాణదుర్గం: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే ప్రతి రోగికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ సూచించారు. కళ్యాణదుర్గంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్, రెన్యూ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం బ్లడ్‌బ్యాంక్, గైనిక్, జనరల్ ఓపీ, చిన్న పిల్లల వార్డును పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీశారు. ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రిలో వైద్యం సరిగా అందలేదంటూ ఏ ఒక్కరూ నిరాశతో వెనుతిరగకూడదన్నారు. డీసీహెచ్ఎస్ కృష్ణవేణి, మెడికల్ ఆఫీసర్ మాధవి, డాక్టర్ హేమలత, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపీపీ మారుతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్, రామచంద్ర, బ్రహ్మయ్య, బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్ అర్చన, కో ఆప్షన్ సభ్యుడు అబ్జల్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు షేక్షావలి, రూరల్ సచివాలయాల కన్వీనర్ భట్టువానిపల్లి అంజి, బిక్కిహరి, హేమ, హబీబ్ పాల్గొన్నారు.

సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం క్రైం: సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ విభాగాలకు సంబంధించి 70 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్పెషాలిటీ పోస్టులూ ఉన్నాయి. https://anantha puramu.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకున్న దరఖాస్తులను భర్తీ చేసి ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాలలో అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 26న కౌన్సిలింగ్ చేపట్టనున్నారు.

వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కూడేరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఆమిదాల గ్రామానికి చెందిన బసవరాజు (46) సొంత పనిపై బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంలో అనంతపురానికి బయలుదేరాడు. కూడేరు మండలం ముద్దలాపురం – జల్లిపల్లి గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా వేగాన్ని నియంత్రించుకోలేకపోవడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న రాళ్ల కుప్పపైకి దూసుకెళ్లింది. ఘటనలో కిందపడిన బసవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గుంతకల్లుటౌన్: స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్డులోని మెడ్‌ప్లస్ ఫార్మసీలో చోరీకి పాల్పడిన కేసులో గుంతకల్లులోని శ్యామ్‌సన్‌పురం వీధికి చెందిన అశోక్‌ని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.31 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. గత నెల 29న రాత్రి మెడికల్ షాప్ షట్టర్ తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన నిందితుడు క్యాష్ బాక్స్‌లోని నగదును అపహరించుకెళ్లాడు. అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం హనుమాన్ సర్కిల్‌లో అశోక్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

బాలిక అదృశ్యం



ప్రియాంక (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లి గ్రామానికి చెందిన బోయ ప్రియాంక మంగళవారం నుంచి కనిపించడం లేదు. బాలిక తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరూ లేని సమయంలో ఆమె ఇల్లు విడిచి వెళ్లినట్లు సమాచారం. బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో చివరకు పోలీసులను తల్లిదండ్రులు ఆశ్రయించారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96826కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

త్వరలో ఏసీఎల్

అనంతపురం: త్వరలో అనంతపురం క్రికెట్ లీగ్ (ఏసీఎల్) పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ కె.మధు ఆచారి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటేందుకు ఏసీఎల్ మంచి వేదిక కానుంది. 2023–24 సీజన్‌కు గాను ఉన్నత పాఠశాల స్థాయిలో బాలుర, బాలికల క్రికెట్ టోర్నీ, కార్పొరేట్ క్రికెట్ టోర్నీ, ఓపెన్ టీ–20 క్రికెట్ టోర్నీ, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఏసీఎల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు 16 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు, అనంతపురం జిల్లాకు చెందిన వారై ఉండాలి. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి సమాచారానికి 98661 57250లో సంప్రదించవచ్చు.

మార్చిలోపు 68వేల గృహ నిర్మాణాలు పూర్తి




ఇంటి నిర్మాణాలు పరిశీలిస్తున్న కేశవనాయుడు

ఉరవకొండ/విడపనకల్లు: జిల్లా వ్యాప్తంగా 2024, మార్చిలోపు 68,267 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు హౌసింగ్ పీడీ కేశవనాయుడు తెలిపారు. ఉరవకొండలోని హౌసింగ్ డీఈ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్దేశించుకున్న మొత్తం ఇళ్లకు సంబంధించి ఇప్పటి వరకూ 55,542 ఇళ్లను గ్రౌండింగ్ చేయగా.. ఇందులో 13,500 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వివిధ దశల్లో 24,979 గృహ నిర్మాణాలున్నాయని వివరించారు. జూలై ఆఖరుకు 5,700 గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఎస్‌హెచ్‌జీల ద్వారా మహిళా సంఘాల్లోని 41,230 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున రుణం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కేటగిరి 3 కింద లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన కాంట్రాక్టర్ బ్యాంక్ ఖాతాకే నేరుగా బిల్లులు జమ అవుతాయన్నారు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు హౌసింగ్ పీడీ కార్యాలయంలో సంప్రదించాలని పిలుపునిచ్చారు. అనంతరం విడపనకల్లు మండలం గడేకల్లు జగనన్న లేఅవుట్‌లో చేపట్టిన గృహ నిర్మాణాలను డీఈ హనుమప్ప, ఏఈలతో కలిసి ఆయన పరిశీలించారు. గడేకల్లు సర్పంచ్ సుశీల, ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, మాజీ సర్పంచ్ భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో అగ్నిప్రమాదం

గుంతకల్లు టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ పోలేరమ్మ గుడి వద్ద వరుసగా ఉన్న మూడు దుకాణాల్లో (రేకుల బంకులు) అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం వేకువజామున తొలుత షేక్ మహమ్మద్‌కు చెందిన మెకానిక్ షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వేస్ట్ ఆయిల్ ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న బట్టల ఇస్త్రీ, బార్బర్ షాపులను తాకాయి. మెకానిక్ షాప్‌లోని ఓ ద్విచక్రవాహనంతో పాటు స్పేర్‌పార్ట్స్, సి.వెంకటేష్‌కు చెందిన బట్టల ఇస్త్రీ బంక్‌లో ఉన్న తోపుడు బండి, పట్టుచీరలు, దుస్తులు, మల్లికార్జునకు చెందిన సెలూన్‌షాప్‌లో ఫర్నిచర్, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. రూ.1.90 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది. బాధితులనను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చిన్నబాబు, మైనార్టీ నాయకుడు నూర్ నిజామి పరామర్శించారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి : సోము వీర్రాజు



విలేకరులతో మాట్లాడుతున్న సోము వీర్రాజు

అనంతపురం టవర్‌క్లాక్/ఉరవకొండ: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బుధవారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. రాష్ట్రానికి కూడా కేంద్రం ఇతోధికంగా నిధులు ఇస్తున్నట్లు తెలిపారు. గోరంట్ల నుంచి అమరావతికి తక్కువ సమయంలో ప్రయాణం చేయడానికి ఆరు వరుసల రహదారిని మంజూరు చేసిందన్నారు. అమరావతికి మూడు రైళ్లు వేశారని, కడప, కర్నూలులో విమానాశ్రయాలు అభివృద్ధి చేశారని, అనంతపురంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు అగ్రికల్చర్ యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా పూర్తయిన పనులను ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. అనంతరం ఉరవకొండలో జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గం సమావేశంలో పాల్గొని, పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక పరిశీలకుడిని నియమించి ఎప్పటికప్పుడు నివేదిక తెప్పించుకుంటామన్నారు. పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు , రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనాథ్‌రెడ్డి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, లలిత్‌కుమార్, ఉరవకొండ అసెంబ్లీ కన్వీనర్ నిరంజన్‌గుప్తా, కొనకొండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బెళుగుప్ప: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిని జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి హెచ్చరించారు. ఎంపీడీఓ యాదవేంద్ర, హౌసింగ్ ఏఈ శివారెడ్డితో కలసి బెళుగుప్ప మండలం శీర్పి, బెళుగుప్ప గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో బుధవారం ఆయన పర్యటించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం బెళుగుప్పలోని సచివాలయాలను పరిశీలించి, సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు పట్టికలో సంతకాలు లేకుండా విధులు నిర్వర్తిస్తుండడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ విందు రాజకీయం



మద్యం సేవిస్తున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో విందు రాజకీయాలకు టీడీపీ తెర లేపింది. ఇటీవల ఆ పార్టీ అధిష్టానం మేరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు చేపట్టిన రాష్ట్రానికి ఇదేం ఖర్మ ముగింపు కార్యక్రమానికి భారీగా వసూలు చేసిన చందాలతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్యం మత్తులో తూలారు. బుధవారం ఉదయం బ్రహ్మసముద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఏకంగా మద్యం దుకాణం వద్దే తిష్టవేసి, నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ హంగామా చేశారు.

ల్యాండ్ సర్వేయింగ్‌పై శిక్షణ

అనంతపురం: జిల్లా కేంద్రంతో పాటు గుంతకల్లులోని స్కిల్ హబ్ కేంద్రాల్లో ల్యాండ్‌సర్వేయింగ్, ప్లంబింగ్, శానిటేషన్, ఎలక్ట్రీషియన్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు స్కిల్ హబ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.గోవిందరాజులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ల్యాండ్ సర్వేయింగ్‌కు ఇంటర్ ఉత్తీర్ణత, మిగిలిన కోర్సులకు పదో తరగతి ఉత్తీర్ణత చెందిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 99086 20306 , 90323 45188లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

నెలాఖరు నుంచి విత్తన పంపిణీ



ఆత్మకూరు: తలుపూరులో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆత్మకూరు: ప్రభుత్వం రాయితీతో అందించే విత్తన వేరుశనగ పంపిణీ మండలంలో ఈ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు ఏఈఓ సుజిత తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారు పాసు పుస్తకంతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని తలుపూరు ఆర్‌బీకేకు విత్తన వేరుశనగ లోడ్ రాగా, ఏఈఓ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నాణ్యత పరిశీలించారు. విత్తనం సరిగా లేక పోవడంతో వెనక్కి పంపారు. అనంతరం అధికారులు మరో లోడ్ విత్తన బస్తాలు పంపగా, వాటిని పరిశీలించి గోదాములో నిల్వ చేయించారు. విత్తనాలు నాణ్యతగా ఉంటేనే తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఓబులేష్, లక్ష్మీనారాయణరెడ్డి ఎంపీటీసీ సభ్యుడు ఓబులేసు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైనది భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: అత్యుత్తమ కట్టడాలకు నాణ్యమైనది భారతి సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం టీవీ టవర్ సమీపంలోని వశికేరప్ప ట్రేడర్స్ దగ్గర తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. టెక్నికల్ ఇంజినీర్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో ఇంజినీర్ల మొదటి ప్రాధాన్యత భారతి సిమెంట్‌కే ఇస్తున్నారన్నారు. తాపీమేస్త్రీలు పని చేసే ప్రదేశాల్లో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, డీలర్ వశికేరప్ప, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: ఉపాధి హామీ కూలీలకు 300 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజువారీ కూలి రూ.600 అందే విధంగా చూడాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు గతంలోలాగా గడ్డపారలు, మెడికల్ కిట్లు అందించాలన్నారు. అలాగే పనిచేసే ప్రాంతంలో నీడ కోసం టెంట్ వేయడంతో పాటు, మజ్జిగ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, సత్యమయ్య, సరస్వతి , పెద్దక్క తదితరుల పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ పోటీలు



మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారునికి బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: మండలకేంద్రం కనగానపల్లిలో శ్రీసత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లలో నెమలివరం జట్టుపై మద్దెలచెరువు, బద్దలాపురంపై మామిళ్లపల్లి జట్టు, శివపురంపై భానుకోట, కొండ్రెడ్డిబాయిపై వేపకుంట జట్లు గెలుపొందాయి. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, బాలరాజు, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జూపూడి రాక

పామిడి: రాష్ట్ర ప్రభుత్వ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు గురువారం పామిడికి రానున్నట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పామిడి కేవీ చలపతి బుధవారం తెలిపారు. ఆయన స్థానిక బైబిల్ మిషన్ సభలో పాల్గొంటారన్నారు.

• పూల కనువిందు

కరువు నేలపై వరుణుడు కరుణించాడు. మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు, కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఎటు చూసినా పచ్చదనం ఆహ్లాదపరుస్తోంది. అనంతపురంలోని చెరువులోని శ్రీసత్యసాయి స్టోరేజ్ ట్యాంకులో కలువ, తామర పూలు విరివిగా వికసించాయి. వివిధ రంగుల్లోని ఈ పూలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఆహారాన్వేషణలో భాగంగా పూల మధ్యన తిరిగే పురుగులను పక్షులు వేటాడుతూ సందడి చేస్తున్నాయి.

- ఫొటోలు : జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో తామర కనువిందు





ఆకుల మధ్యలో కాయలు



కనువిందు చేస్తున్న పూలు



పూల వద్ద పురుగుల కోసం పక్షి వేట

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రామగిరి: గ్రామీణప్రాంతాల్లో క్రీడాకారులను మరింత ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పేరూరుడ్యాంలో శ్రీసత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో టోర్నీ ప్రారంభించినట్లు తెలిపారు. జూన్ 6వ తేదీన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అనంతపురంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విజేతకు రూ.1.20 లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో మరింతగా రాణించాలన్నారు. అనంతరం ఎంసీ పల్లిలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు.

పేరూరు, శ్రీహరిపురం జట్ల జయకేతనం

బుధవారం ఉదయం సుద్దకుంటపల్లి–పేరూరు జట్లు తలపడగా పేరూరు జట్టు, మధ్యాహ్నం ఎంసీపల్లి, శ్రీహరిపురం కాలనీ జట్లు తలపడగా శ్రీహరిపురం జట్టు విజయం సాధించినట్లు టోర్నీ నిర్వాహకుడు దాసరిమోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.కర్రెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, జెడ్పీటీసీ సభ్యులు గోసే నాగార్జున, గౌని మారుతీ ప్రసాద్, సర్పంచ్ రాజేష్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, కురుబ ముత్యాలప్ప, జనార్దన్, మల్లికార్జున, ఆది, నరసింహారెడ్డి, సిద్దన్న, ఎజ్జె ఆంజనేయులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు స్ఫూర్తిదాయకం



వలంటీర్లను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మేయర్ వసీం, చిత్రంలో కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని నగరపాలక సంస్థ మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థలోని అదనపు సమావేశ భవనంలో వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. 19 నుంచి 40 సచివాలయాలు, 73వ సచివాలయ పరిధిలోని వార్డు వలంటీర్లను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా వలంటీర్లు గురుతర బాధ్యతగా పని చేస్తూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. వేకువజామున నుంచే పింఛన్ పంపిణీ చేస్తున్నారన్నారు. సీఎం సహకారంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు రాజేశ్వరి, లావణ్య, లీలావతి, నాగవినుత, సాకే చంద్రలేఖ, బాలాంజినేయులు, సైపుల్లాబేగ్, సంపంగి రామాంజినేయులు, వెంకటరమణ, అబూసలేహా, కో ఆప్షన్ సభ్యురాలు సుశీలమ్మ, నాయులు సుకేష్, చిన్న, జావీద్, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌డీ కార్యాలయంలో...

నగరంలోని మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ‘వలంటీర్లకు వందనం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. 41 నుంచి 57వ సచివాలయ పరిధిలోని 250 మంది వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి



ఎస్కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 5 నుంచి 10 వరకు నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. పీజీ సెట్ జూన్ 5 నుంచి 15 వరకు ఉన్నందున డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. డిగ్రీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పీజీ సెట్‌కు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, జి.చిరంజీవి, నగర కార్యదర్శి రమణయ్య, ఉమామహేష్, ఆనంద్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యూరో సేవలు వైద్య కళాశాలకే గర్వకారణం



కేక్ కట్ చేస్తున్న న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, చిత్రంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, తదితరులు

అనంతపురం క్రైం: ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలు, క్రిటికల్ కేసులను సైతం విజయవంతం చేస్తున్న న్యూరో వైద్యులసేవలు కళాశాలకే గర్వకారణమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి (ఎస్ఎస్‌హెచ్)లో న్యూరో సర్జరీలు మొదలై ఏడాదైన సందర్భంగా బుధవారం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్ బాబు తదితరులు కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ భాస్కర్ నేతృత్వంలో వైద్యులు వినూత్న(ఇన్నోవేటివ్) రీతిలో తల, వెన్నెముక సర్జరీలు చేస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకువస్తున్నారన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలతో రోగులకు నాణ్యమైన సేవలందుతున్నట్లు తెలిపారు.

10వేల మందికి సేవలందించాం:

న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకు దాదాపు 10 వేల మందికి ఓపీ, ఐపీ, సర్జరీ, తదితర వైద్య సేవలందించినట్లు తెలిపారు. రూ.లక్షలు విలువ చేసే ఖరీదైన వైద్యాన్ని ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. తమ వైద్య బృందం డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు, అనస్తీషియా వైద్యులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ మధు, డాక్టర్ నాగరాజు, స్టాఫ్‌నర్సులు, ఆపరేషన్ టెక్నీషియన్లు, క్లాస్ 4 ఉద్యోగులందరూ సమష్టిగా పని చేసి రోగులకు ఉత్తమ సేవందిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ సుబ్రమణ్యం, గుండె వైద్య నిపుణులు డాక్టర్ వైవీ రావు తదితరులు పాల్గొన్నారు.

348 మంది విద్యార్థులకు ప్రవేశాలు

రాప్తాడు రూరల్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో రెండో విడతగా 348 మంది పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించారు. ఎంపికైన విద్యార్థుల జాబితా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాకు చేరింది. విద్యార్థులకు కేటాయించిన పాఠశాలల జాబితాను మండల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపారు. ఈ నెల 28లోగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందాలని డీఈఓ ఎం.సాయిరామ్ సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు విధించరాదని ఆయా స్కూళ్ల యాజమాన్యాలను డీఈఓ ఆదేశించారు. ఏదైనా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కిమ్స్–సవీరాలో కీ హోల్ ఆపరేషన్లు

అనంతపురం క్రైం: కిమ్స్–సవీరా ఆస్పత్రిలో కీ హోల్ గుండె శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. గుండెకు సంబంధించిన రక్తనాళాలు పూడుకుపోవడం, వాల్వులు పాడైనప్పుడు ఛాతి ఎముకను కత్తిరించి గుండె వరకు వెళ్లి శస్త్రచికిత్స చేసే పరిస్థితి గతంలో ఉండేదన్నారు. కీహోల్ ఆపరేషన్లు అందుబాటులోకి రావడంతో ఆ పరిస్థితి తొలగిందన్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో మాత్రమే చేసే ఈ తరహా శస్త్రచికిత్సలు ఇప్పుడు తమ ఆస్పత్రిలోనూ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తున్నామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అబీబ్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయాలి

బుక్కరాయసముద్రం: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభలను వెలికితీయాలని ఆర్డీటీ డైరెక్టర్ దశరథ్ పేర్కొన్నారు. బుధవారం సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ బధిరుల హైస్కూల్‌లో రెండు రోజుల పాటు సృజన–2023 సెంట్రల్ లెవల్ కల్చరల్ ఉత్సవాలు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి, ఆర్డీటీ డైరెక్టర్లు, బధిరుల పాఠశాల హెచ్‌ఎం ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ముంపు నుంచి శాశ్వత విముక్తి



నడిమివంకను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఆర్డీఓ మధుసూదన్

• వంకలకు రక్షణ గోడల నిర్మాణం

అనంతపురం సెంట్రల్: భారీ వర్షాలు కురిసిన సమయంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. వంకలకు రక్షణ గోడల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి సదరు ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రుద్రంపేట నుంచి జాతీయ రహదారి 44 వరకూ 1.75 కిలోమీటర్ల మేర నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి రూ.46.50 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దీని వలన నడిమివంకను ఆనుకొని ఉన్న ఆదర్శనగర్, సుందరయ్యకాలనీ, దండోరాకాలనీ, జాకీర్‌కొట్టాల, బీఎస్ఆర్ కాలనీ ప్రాంతాల ప్రజలకు ముంపు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఈ నిధులతో ఐదు చోట్ల సింగిల్ లేన్ బ్రిడ్జిల నిర్మాణం చేపడతామన్నారు. అలాగే ఎన్‌హెచ్ 44 నుంచి హెచ్‌ఎల్‌సీ అక్విడెక్ట్ (రాజీవ్‌కాలనీ) వరకు రక్షణ గోడ నిర్మాణం, సింగిల్‌లేన్ బ్రిడ్జిల ఏర్పాటుకు రూ. 43.30 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. నగరంలో అశోక్‌నగర్ బ్రిడ్జి నుంచి పాత రమణ, రమేష్ థియేటర్ వరకు 600 మీటర్ల రక్షణ గోడ నిర్మాణం కోసం రూ.40.58 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిధులన్నీ సీఎం ప్రత్యేక నిధుల నుంచి విడుదల చేయనున్నట్లు వివరించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ ప్రతాప్, ఆర్డీఓ మధుసూదన్, ఏఈ క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. సంగమేశ్వరనగర్‌కు చెందిన చింతా ప్రసాద్ అనే యువకుడు అరవింద్‌నగర్‌లోని టీడీపీ మహిళా నేత బండారు శ్రావణిశ్రీ ఇంట్లో పని చేసేవాడు. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాణీనగర్‌లో నివాసముంటున్న బాలిక మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు.

బైక్ చోరీ

వినాయకనగర్‌కు చెందిన వెంకటేష్ బైక్ చోరీ అయ్యింది. పార్క్ చేసి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారంటూ బాధితుడు బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఒంటరి మహిళకు లైంగిక వేధింపులు

రాణీనగరులో నివాసముంటున్న గాయత్రి అనే మహిళ కుటుంబ అవసరాల నిమిత్తం రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన ఎర్రపురెడ్డితో రూ.4 లక్షలు అప్పు తీసుకుంది. గాయత్రి తన భర్తకు దూరంగా ఉంటున్న విషయం తెలుసుకున్న ఎర్రపురెడ్డి ఆమెను ఎలాగైనా లొంగదీసుకోవాలని చూశాడు. అందుకు ఆమె నిరాకరించడంతో వేధించడం మొదలు పెట్టాడు. వేధింపులు పెరిగిపోవడంతో బాధితురాలు బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చెత్త నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

అనంతపురం క్రైం: చెత్త నిర్వహణ పకడ్బందీగా చేపట్టి, పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని కమిషనర్ రమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నోడల్ ఆఫీసర్లు, విభాగాల హెడ్స్, సచివాలయ సిబ్బందితో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు యార్డుకు పంపాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. పనులు వేగవంతం చేయాలి: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఇంజినీర్లను కమిషనర్ ఆదేశించారు. బుధవారం నగరంలోని నాలుగో రోడ్డులో ఉన్న నేతాజీ స్కూల్, రజాక్‌నగర్‌లోని శ్రీ వివేకానంద ఎంపీఎల్ ప్రైమరీ స్కూల్‌లో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు.

రైతులను ఆదుకోండి

అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం (సీపీఐ అనుబంధం) నాయకులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో డీఏఓ చంద్రానాయక్ అందుబాటులో లేకపోవడంతో టెక్నికల్ ఏఓ రాకేషనాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు 90 శాతం రాయితీతో అన్ని రకాల విత్తనాలు అందించాలని కోరారు. వడగండ్లు, ఈదురుగాలులు, అకాల వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలకు సంబంధించి రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు.


కవి అమళ్లదిన్నెకు అరుదైన గౌరవం



అమ్మళ్లదిన్నె వెంకటరమణప్రసాద్

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన అష్టావధాని డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. బెంగళూరుకు చెందిన సీపీ బ్రౌన్ సేవా సమితి వారు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శతక రచనల పోటీలు నిర్వహించారు. వందల సంఖ్యలో కవులు పోటీ పడిన వివిధ రాష్ట్రాలకు చెందిన 13 మందిని విజేతలుగా గుర్తించారు. అందులో ప్రథమ స్థానం దక్కించుకున్న జిల్లా వాసి అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ ఈ నెల 27న బెంగళూరులో జరిగే వేడుకల్లో రూ.15 వేల నగదు బహుమతితో పాటు సత్కారం అందుకోనున్నట్లు నిర్వాహకులు లక్ష్మీరెడ్డి తెలిపారు. జిల్లా ఖ్యాతిని మరోసారి జాతీయస్థాయిలో రెపరెపలాడించిన అమళ్లదిన్నెను పద్య కవులు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఏలూరు యంగన్న, రియాజుద్దీన్, ఒంటిద్దు రామలింగారెడ్డి అభినందించారు.

మార్మోగిన ఆంజనేయ నామస్మరణ



వడల హారంలో భక్తాంజనేయుడు

అనంతపురం కల్చరల్: ‘జయహనుమాను జ్ఞాన గుణ సాగర జయ కపీశ..’ అంటూ భక్తుల ఆంజనేయుని నామస్మరణతో ఆలయం మార్మోగింది. నగరంలోని హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టలు జరిగి ఎనిమిదేళ్లు పూర్తి అయిన సందర్భంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధి పరుచూరు రమేష్ నేతృత్వంలో స్వామివారికి 4వేల వడల హారం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు నిలువెత్తు పవనపుత్ర హనుమంతుడి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, శ్రీగంధ లేపన సేవలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తబృందాలు బారులు తీరి 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశాయి. అనంతరం స్వామివారి వడ మాలను ప్రసాదంగా భక్తులకు వితరణ చేశారు.

కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: వివిధ కారణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య సంబంధిత కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు డిప్యూటీ మేయర్‌కు విన్నవించగా, ఆమె సూపరింటెండెంట్ దేవశంకర్ తదితర సిబ్బందితో మాట్లాడారు. రోజుల తరబడి ఎందుకు జాప్యం చేస్తున్నారని, తక్షణం ఆ ఫైల్‌ను ముందుపంపాలని సూచించారు.